www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 మే 2025
5
కాకినాడ



5న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 5న స్థానిక కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కెఎల్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఫీల్డ్ (కలెక్షన్), ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలి సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఇండో ఎంఐఎం, హ్యుండాయ్ మోబీస్, హ్యుండాయ్ గ్లోవీస్, పానాసోనిక్, స్కైగార్డ్ ఎలక్ట్రానిక్స్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. డియుజికెవై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7799376111, www.vikasajobs.comలో సంప్రదించాలన్నారు.

పదేళ్లలో నాలుగింతలు

- ఈ ఏడాది భారీగా పెరిగిన పసిడి ధరలు
- కొనుగోలుకు సామాన్యులు వెనకడుగు
- కార్పొరేట్ రాకతో స్థానిక షాపులు వెలవెల



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

బంగారం ధర పదేళ్లలో నాలుగింతలైంది. ఈ ఏడాది రూ.లక్ష దాటి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గుదల ఉన్నా... ఇది తాత్కాలికమే అంటున్నారు వ్యాపారులు. రాబోయే కాలంలో పెరగడమే తప్ప తగ్గే అవకాశం ఉండదంటున్నారు. సామాన్యులు కొనలేని స్థాయికి నేడు బంగారు ధర చేరింది. ధనిక, పేద అనే తేడా లేకుండా పెళ్లిళ్లు, శుభకార్యాలు అంటే ముందుగా గుర్తుకొచ్చేది బంగారమే. ధనవంతులు కాస్త ఎక్కువగా, మధ్య తరగతి ప్రజలు వారి స్థోమతకు తగ్గట్టుగా బంగారు నగలను కొనుగోలు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది పసిడి ధరలు అందనంత ఎత్తుకు చేరాయి. ఎప్పటికప్పుడు పసిడి ధరలు ఆల్‌టైం రికార్డులను నమోదు చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇన్వెస్టర్లు బంగారంపై ఉంచు తున్నారు. అమెరికా, చైనా దేశాల మధ్య జరుగుతున్న ఆర్థిక యుద్ధం నేపథ్యంలో దేశంలో బంగారు ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. అయితే ఈ ఏడాది బంగారం గ్రాము ధర రూ.9,878గా ఉంది. గడిచిన పదేళ్లలో గ్రాముకు రూ.7078 పెరిగింది. వెండి ధరలు సైతం పరుగులు పెడుతున్నాయి. గడిచిన 50 ఏళ్లలో పెరిగిన ధర ఒక ఎత్తయితే ఈ పదేళ్లలో పెరిగిన ధర అధికం అనడంలో ఎం మాత్రమూ అతిశయోక్తికాదు. బంగారం ధరల పెరుగుదల, మరో వైపు కార్పొరేట్ సంస్థలు రాకతో స్థానిక వ్యాపారాలు పూర్తిగా వెల వెల బోతున్నాయి. ఆభరణాల తయారీ కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుంటూ వలసలు వెళ్లిపోతున్నారు.

రాజమహేంద్రవరంలో 200లకు పైగా షాపులు

అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య పోరుతో పాటు డాలర్ బలహీనపడడం వంటి కారణాలతో మదుపరులు బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే కాకుండా ప్రభుత్వం గోల్డ్ నిల్వలు పెంచుకుంటూ ఉంది. యుఎస్ ఎకానమీ పడిపోవడం, డాలర్ మీద నమ్మకం సన్నగిల్లడంతో బంగారంపై పెట్టుబడులు పెట్టడం ప్రత్యామ్నాయంగా మారింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం 3,319 డాలర్లకు చేరువలో ఉంది. బంగారం ధర రోజు రోజుకు పెరుగుతుండటంతో మార్కెట్ వెలవెలబోతోంది. గడిచిన వారంలో పసిడి ధర గ్రాముకు రూ.200పైనే పెరిగింది. గత ఏడాది చాలాకాలం గ్రాము బంగారం రూ.5400 నుంచి రూ.5900 మధ్యనే ఉంది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల ప్రభావం బులియన్ మార్కెట్‌పై చూపింది. దీంతో ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరగడంతో ధర ఆకాశాన్ని అంటింది. జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం పట్టణాల్లో అత్యధికంగా బంగారం దుకాణాలు ఉన్నాయి. అత్యధిక వ్యాపారం రాజమహేంద్రవరంలో జరుగుతోంది. మెయిన్ రోడ్డు, గోకవరం బస్టాండ్, ఎవి అప్పారావు రోడ్డు తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు, ఇతర చిన్న షాపులు కలిపి 200పైగా ఉన్నాయి. ప్రస్తుతం ధర పెరగటంతో వినియోగ దారులు కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత తగ్గు తుందన్న ఆశతో అవసరం ఉన్నా ఆ స్థాయిలో కొనుగోలు చేయడం లేదు. దీంతో జ్యూయలరీ షాపుల్లో సందడి కనిపించడం లేదు. దీనికి తగ్గట్టు వెండి కూడా దూసుకుపోతోంది.

పెళ్లిళ్ల సీజన్ అయినా కొరవడిన సందడి

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో కళ కళలాడాల్సిన బంగారం షాపులు వెలవెల బోతున్నాయి. ఓ వైపు ధరలు పెరగటం మరో వైపు, కార్పొరేట్ సంస్థలు రాక ప్రధాన కారణమని జ్యూయలరీ షాపుల యజమానులు చెబుతున్నారు. 2013లో రూ.2,920 ధర ఉండేది. 2014లో రూ.2,800, 2015లో రూ.2,634, 2016లో రూ.2,862కు చేరింది. 2017లో రూ.2,900, 2018లో రూ.3,000, 2019లో రూ.3,200చేరింది. 2020లో రూ.3,50 నుంచి రూ.4200, 2021లో రూ.4,800, 2022 రూ.5,300, 2023లో రూ.6,200 చేరింది. తాజాగా రూ.7450కి చేరింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో సుమారు 10 వేలకు పైగా కార్మికులు ఆభరణాల తయారీ రంగంలో ఉపాధి పొందేవారు. ఈ రంగంలో ఆధునిక సాంకేతిక పరికరాలు రావటం, ధరలు పెరుగుదల, కార్పొరేట్ సంస్థలు రెడీమెడ్ వ్యాపారం ప్రారంభించటంతో కార్మికులకు ఉపాధి కొరవడింది. దీంతో సుమారు 40 శాతం మంది ఇతర రంగాలకు తరలి వెళ్లినట్లు జ్యూయలరీ వర్కర్స్ చెబుతున్నారు. బంగారు ఆభరణాల కోసం ఇతర జిల్లాల నుంచి సైతం గతంలో రాజమహేంద్రవరం వచ్చే వారని ప్రస్తుతం స్థానికులు సైతం రెడీమెడ్‌పై ఆసక్తి చూపిస్తున్నారని తెలుస్తోంది.

బంగారం ధరలు క్రమంగా పెరుగుదల

బంగారం ధరలు క్రమ క్రమంగా పెరగటమే తప్ప తగ్గే పరిస్థితులు కన్పించటంలేదు. రాజమహేంద్రవరంలో కిరాణా స్టోర్స్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాను. ప్రతి సంవత్సరమూ అక్షయ తృతీయ, సంక్రాంతి, దసరా పండుగకు బంగారం ఆభరణాలు కొనుగోలు చేస్తుంటాను. గత ఐదేళ్లలో ధరలు విపరీతంగా పెరగటంతో వెనకడుగు వేయాల్సి వస్తోంది. గతంలో తయారీ చేయించే వాళ్లము. ప్రస్తుతం మోడల్స్ అందుబాటులో ఉండటంతో రెడీమేడ్ కొంటున్నాము.

- కె.వెంకటేశ్వరరావు సీతం పేట, రాజమహేంద్రవరం

ఆభరణాల వ్యాపారం ఆశాజనకంగా లేదు

బంగారు ఆభరణాలు తయారీ, విక్రయం రంగంలో గత మూడు దశాబ్దాలుగా పని చేస్తున్నాను. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో విరివిగా ఆర్డర్లు వచ్చేవి. మా కుటుంబంతో పాటు మరో ఐదుగురు మా షాపులో ఉపాధి పొందేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా తలకిందులయ్యాయి. కార్పొరేట్ సంస్థలు గడిచిన ఐదేళ్లలో 5కు పైగా భారీ షాపులు ఏర్పాటు చేశాయి. దీంతో స్థానిక వ్యాపారాలు పడిపోయాయి. పండుగలకు, గతంలో తయారీ చేయించే వారు సైతం ప్రస్తుతం రెడీమేడ్ కొనుగోలు చేయటంతో ఉపాధి కొరవడింది.

- కె.భాస్కరాచారి, మెయిన్ రోడ్డు

భారీ వర్షంతో తడిసి ముద్దయిన ధాన్యం

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం



ధాన్యం రాశులను ప్లాస్టిక్ బరకాలతో భద్రపరిచిన రైతులు

సామర్లకోట పట్టణం మండల పరిధిలో శనివారం జోరుగా ఉండబోత వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో దాళ్లా వరి పంట మాసూళ్లు చేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం రాశులను హడావిడిగా పోగు పెట్టి ప్లాస్టిక్ బరకాలతో మూసి వర్షం నీరు ధాన్యం రాశులను ముంచకుండా జాగ్రత్తలు పడ్డారు. సామర్లకోట-పిఠాపురం రోడ్డులో వందలాది రాశులు ప్లాస్టిక్ బరకాలతో కప్పినప్పటికీ వర్షం నీటిలో తడవక తప్పని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఈదురు గాలులకు ప్లాస్టిక్ బరకాలు ఎగిరిపోవడంతో ధాన్యం రాశుల్లోకి నీరు చేరిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షం కారణంగా పట్టణంలో పలు డ్రైన్లు ముంపునకు గురవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట భారీ వర్షంతో తమ చేతికి అందుతుందో లేదో అని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెద్దాపురంలో శనివారం సాయంత్రం కురిసిన పెద్ద వర్షానికి వరి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో 90 శాతం వరి పొలాల కోతలు పూర్తయ్యాయి. అనేక గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం ఇంకా కల్లాలపైనే ఉంది. ఈ ధాన్యం కనుక తడిస్తే ధాన్యం కొనే నాథుడు ఉండడని రైతుల్లో ఆందోళన నెలకొంది. కల్లాలపై వర్షాలు కురవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కల్లాలపై ఉన్న ధాన్యాన్ని వర్షం నీటికి తడవకుండా రక్షించేందుకు రైతులు తీవ్రంగా కషి చేస్తున్నారు. టార్పాలిన్లు, ప్లాస్టిక్ బరకాలతో కళ్లాలపై ఉన్న ధాన్యాన్ని రక్షించేందుకు అవస్థలు పడుతున్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు



రైతులతో కలిసి ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాజబాబు

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్మాలని అప్పుడు మాత్రమే పూర్తి మద్దతు ధర వస్తుందని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శనివారం ఒంటితాడి, శీల, మంజేరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసిందనే సాకుతో రూ.1500 నుంచి రూ.1600లోపు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రైతులు పెట్టిన పెట్టుబడికి ఏమాత్రం సరిపోదని తెలిపారు. రైతాంగం అప్పుల పాలవుతోందని, వ్యవసాయ ఖర్చులు పెరిగిన కారణంగా రైతులకు ఏమీ మిగలడం లేదని తెలిపారు. ప్రభుత్వం చెపుడుతన్న దానికి మిల్లర్లు మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేస్తున్న దానికి పొంతన లేదన్నారు. ఈ కార్యక్రమంలో దండంకి సమర్పణ రావు, ఆర్.సత్యనారాయణ, ఎస్.ముసలయ్య పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పెద్దాపురం

జి.రాగంపేట పరిధిలోని అత్తా కోడలు చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి మట్టిని తరలించుకుపోయిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ కె.శ్రీరమణికి ఉపాధి కూలీలు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలో చెరువులు ఉపాధి కూలీలకు పని కల్పించే వనరులుగా ఉన్నాయన్నారు. ఈ చెరువులను కొంతమంది స్వార్థపరులు జెసిబిలతో అనేక అడుగుల లోతు తవ్వి మట్టిని అక్రమంగా తరలించకపోయి అమ్ముకుంటున్నాన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలించకపోయే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆర్‌డిఒ శ్రీరమణి స్పందిస్తూ దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తొలుత జి.రాగంపేట పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ వెంటనే అత్యవసర గ్రామసభ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మనం-మన ఊరు కమిటీ అధ్యక్షుడు ఎస్.కల్యాణ్ కుమార్, కార్యదర్శి పి.నగేష్, మోటూరు వీరబాబు, ఆర్.మంగరాజు, కె.రవీంద్ర పాల్గొన్నారు.



మస్టర్లను పరిశీలిస్తున్న ఎపిడి

ఉపాధి పనులు పరిశీలించిన ఎపిడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంంలోని ఆనూరు, కొండపల్లి గ్రామాల్లో శనివారం ఉపాధి పనులను ఉపాధి హామీ పథకం ఎపిడి భాను ప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రెండు పంచాయితీల పరిధిలోని తిమ్మన్న చెరువు, వీరప్ప చెరువు, గడ్డి చెరువులలో నిర్వహిస్తున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీల మస్తర్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన కూలీలతో పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుధీర్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు నరేష్, రమణ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కాకినాడ



ఎస్‌పి బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నేతలు

మాజీ ఎంఎల్‌ఎ సత్తి సూర్యనారాయణ రెడ్డిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ ఎంఎల్‌ఎలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణ రెడ్డి కాకినాడ జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్‌ను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు మీడియాతో మాట్లాడారు. అధికారం అంటే అహంకారం కాదని ఆ విషయం అనపర్తి ఎంఎల్‌ఎ రామకృష్ణారెడ్డి గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆయన ఎన్ని దాడులు చేసిన ఆయన అవినీతి అక్రమాలపై పోరాడుతూనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి చెప్పారు. బాధితులను ఇప్పటివరకు ఎంఎల్‌ఎ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు.

బీచ్ ప్లాంటేషన్‌కు రంగం సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

కాకినాడ జిల్లా తీరరేఖ వెంబడి గుర్తించిన ఖాళీ భూములలో వర్షాలు ప్రారంభమైయ్యే లోపు పెద్ద ఎత్తున బీచ్ ప్లాంటేషన్ చేపట్టేందుకు రంగం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శనివారం డిఎఫ్ఒ, పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్, కాకినాడ రూరల్, యు. కొత్తపల్లి, తొండంగి తహశీల్దారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ జిల్లా తీరంలో ప్రతిపాదించిన బీచ్ ప్లాంటేషన్ ప్రణాళికపై చర్చించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ తీరానికి తుపానుల నుంచి రక్షణ కల్పించడంతో బాటు, సుందరీకరణ, ఆదాయ కల్పన, టూరిజం ప్రొమోషన్ లక్ష్యాలుగా అందుబాటులో ఉన్న ఖాళీ భూముల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఇందుకు తొలి దశగా కాకినాడ రూరల్ మండల్ తీరంలోని నేమాం, తమ్మవరం, యు.కొత్తపల్లి మండలంలో కొమరగిరి, తొండంగి మండలంలోని ఒంటిమామిడి, గొల్లముసలయ్యపేట, వేమవరం వద్ద సుమారు 70 ఎకరాల తీర భూములను గుర్తించామన్నారు. ఈ భూములలో నాటేందుకు అనువైన వృక్ష జాతులకు చెందిన లక్ష మొక్కల సాప్లింగ్‌లను వర్షాలు ప్రారంభానికి ముందే సిద్ధం చేయాలని డిఎఫ్ఒకు సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే పనులను మండల తీర్మానాలతో చేపట్టేందుకు ఈ నెల 15వ తేదీ లోపు శాంక్షన్‌లు పూర్తి చేయాలని డ్వామా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎఫ్ఒ డి.రవీంద్రనాథరెడ్డి, పాడా ప్రాజెక్ట్ డైరక్టర్ ఎ.చైత్ర వర్షిణి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-పిఠాపురం

గర్భిణులు పౌష్టికాహార లోపం వల్ల ప్రసవ సమయంలో రక్తహీనతతో ఇబ్బందులు గురికారాదని చేయూత సంస్థ సహకారంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహార కిట్స్ పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎం.రవికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో సుదూర ప్రాంతాల నుంచి గర్భిణులు వైద్య చికిత్సకు వచ్చి సకాలంలో ఆహారం అందక ఆకలితో అలమటించడం గమనించి గత 5 ఏళ్లుగా కాకినాడ ప్రభుత్వాసుపత్రి వద్ద చేస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి కొనసాగింపుగా పిఠాపురంలో 45 రోజుల నుంచి నిరంతరాయంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద గర్భిణులు, రోగుల సహాయకులకు భోజన పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, అభివృద్ధి కమిటీ సభ్యుడు బొజ్జ కుమార్, చేయూత పిఠాపురం అన్నదాన కమిటీ సభ్యులు కాకి రాంబాబు, పిఠాపురం ఇంచార్జి శ్రీమాన్, సంస్థ సభ్యులు గరగ రామ్ పిఠాపురం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శృంగార వల్లభునికి రూ.3.19 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,26,010, అన్నదాన విరాళాల ద్వారా రూ.54,827, కేశఖండన ద్వారా రూ.12,560, తులాభారం ద్వారా రూ.650, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.25,395 మొత్తం రూ.3,19,442 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ప్రస్తుత వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని యాత్రికులందరికీ మజ్జిగ సరఫరా చేశామన్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సహాయ సహకారాలు అందించారన్నారు.

రోగులకు ఆహారం అందజేత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ కో చైర్మన్ వాగు రాజేష్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఆసుపత్రిలో చలివేంద్రం ప్రారంభించి, రోగులకు ఆహార పదార్థాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ మాట్లాడుతూ పుట్టినరోజు, ఇతర ముఖ్యమైన రోజుల సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బుగత శ్రీను, సామంతుల గోపి, అనంతారపు రాజు, మామిడి శ్రీను, పెచ్చెట్టి కృష్ణ, మైరాల నాగేశ్వరావు వైద్యులు ఎన్.రఘుపతి, కె.లావణ్య, సిబ్బంది జి.పరిమళ కుమారి, చక్రవర్తి, రాజు ఉన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన అవసరం


ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు, ర్యాలీలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులు క్రిమిసంహారక మందులు వల్ల భూమి సారవంతం తగ్గిపోవడంతో పాటు ప్రజలు అనారోగ్యాలు బారిన పడుతున్నారన్నారు. ఎఒ బి.జ్యోతి, మెప్మా ఆర్పిఇ ప్రమీల, ఎంపిఇఒ దివ్య, మజ్జి నాగేశ్వరరావు, ముదర ఏసుబాబు, పి.వెంకటలక్ష్మి ఉన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-పిఠాపురం

గ్రామాల్లో బాల్య వివాహాలపై విస్తతంగా అవగాహన కల్పించాలని సిడిపిఒ సిహెచ్ఎస్‌కె.దుర్గాదేవి అన్నారు. శనివారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ కుమారి ఆదేశాల మేరకు నియోజకవర్గ పరధిలోని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ బాల్య వివాహల నిషేధ చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే దాన్ని బాల్య వివాహంగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాన్ని ప్రోత్సహించి సహకరించిన వారిపై బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 ప్రకారం శిక్ష విధిస్తారని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 181, 112 టోల్‌ఫ్రీ నంబర్స్‌కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్, బి.దుర్గారాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఆదిత్యలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-గండేపల్లి



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ముఖ్య అతిథులు

ఆదిత్య యూని వర్సిటీలో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా కాట్మండు యూనివర్సిటీ నేపాల్ అసోసియేట్ ప్రొఫెసర్ యు.ప్రసాద్ ప్యాకురెల్, గౌరవ అతిథిగా జింబాబ్వే ఎంబసీ భారతదేశ ప్రతినిధి ఫినియాస్ మాన్యాంగ పాల్గొన్నారు. కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరంలో బి.టెక్, ఎం.టెక్. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మా డి, బిఎస్‌సి ఫోరెన్సిక్, బిబిఎ, ఎంబిఎ, విభాగాలలో చదువు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే యొక్క ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. కళాశాలలో చదువుకున్న రోజులు గడిపిన స్నేహ బాంధవ్యాలు, ఉపాధ్యాయులతో మనం నడుచుకునే విధానం ఇవి అన్నీ మన జీవిత కాలంలో మధురానుభవంగా మిగిలిపోతాయన్నారు. ఇప్పటి వరకు గడిచిన జీవితం వేరు రాబోయే రోజుల్లో జీవితం పట్ల బాధ్యతగా మనకంటూ ఒక గుర్తింపు కోసం వేరు వేరు దారుల్లో ప్రయాణం చేయడంతో పాటు వివిధ రంగాలలో మనం స్థిర పడవలసి వస్తుందన్నారు. ప్రొఫెసర్ ఎంబి.శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదువు పూర్తి చేసిన విద్యార్థులకు మంచి భవిష్యత్ కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంబి.శ్రీనివాస్, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్, డాక్టర్ ఎ.రమేష్, రిజిస్ట్రార్ డాక్టర జి.సురేష్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ పాల్గొన్నారు.



ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌టిఒ ఆఫీస్ ఆవరణలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐవైఎఫ్ 1959లో మే 3న ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు యువజన హక్కులపై నిరుద్యోగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన ఏకైక సంఘం ఎఐవైఎఫ్ అన్నారు. నేడు నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు అవుతున్నా ఆ ఊసే లేదన్నారు. ఈ నెల 15, 16, 17, 18 తేదీల్లో తిరుపతిలో జరగబోయే ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోండా మైఖేల్, గోనెల నాగభూషణం, ఇ.మధు, కొండేలు నాగేష్, సిహెచ్.అశోక్, కె.అజయ్, వీరబాబు, అనిల్ పాల్గొన్నారు.

వేడెక్కుతున్న వాతావరణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక పక్క ఎండలు... మరో పక్క కార్మికులు, స్కీమ్ వర్కర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది సమస్యలపై పోరాటాలతో ఉమ్మడి జిల్లాలో వాతావ'రణం' వేడెక్కుతోంది. కూటమి సర్కారు అవలంబిస్తున్న విధానాలు ప్రజలను సంతృప్తి పరచలేకపోతున్నాయి. ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకపోవడంతో పలు సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. కొన్ని విధానాల వల్ల కొన్ని వర్గాల ప్రజలు ఉపాధికి సైతం దూరమవ్వడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. 1-19 సర్కులర్‌ను అమలు చేయాలని, పాత పద్ధతిలోనే హెల్త్ విధానాన్ని అమలు చేయాలంటూ ఆర్‌టిసి కార్మికులు రిలే దీక్షలకు దిగారు. ఎంటిఎస్ అమలు చేయాలంటూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు సమ్మెకు పూనుకున్నారు మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని, నెలకు వేతనం రూ.7,800 మాత్రమే ఇస్తున్నారని, కాంట్రాక్టు గడువు ముగుస్తున్నందున్న ప్రభుత్వమే 102 వాహనాలను నిర్వహించాలంటూ తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లు తాజాగా ఆందోళనకు దిగారు. కాకినాడ పోర్టులో ఎగుమతులు, దిగుమతులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ పోర్టుకార్మికులు వేడుకుంటున్నారు. ఇక స్కీమ్ వర్కర్ల సమస్యల పరిస్థితి సరేసరి. వారి సమస్యలను పరిష్కరించిన దాఖలు ఎక్కడా లేవు. ఈ నేపథ్యంలో జరిగిన మేడే వేడుకలు ఈ సారి ప్రత్యేకం. సమస్యలను ఎదుర్కొంటున్న ప్రతి శ్రామికుడూ, ఉద్యోగులూ, స్కీమ్ వర్కర్లు పార్టీలు, సంఘాలకు అతీతంగా మేడే ఉత్సవాలను నిర్వహించారు. అంతే కాకుండా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రతిన బూనారు. మేడే రోజున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. మేడే పురస్కరించుకుని గతంలో నిర్వహించిన పోరాటాలను గుర్తు చేసుకుని స్ఫూర్తిని పొందారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ సందర్భంగా నాయకులు వివరించారు. కార్మిక సంఘాలు దశాబ్దాల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్న విషయం విధితమే. ట్రేడ్ యూనియన్ చట్టం, పారిశ్రామిక విధానాల చట్టం,ఫ్యాక్టరీ చట్టం, ప్రావిడెంట్ ఫండ్ చట్టం వంటివి రద్దు చేస్తున్నారు. ఈ చట్టాల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టబోయే సమ్మెకు సన్నద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

తుని పంచాయితీకి తెర

తుని మున్సిపాలిటీలో నెలకొన్న పంచాయితీకి ఎట్టకేలకు తెరపడింది. తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు ఏకగ్రీవమైంది. గతంలో వైసిపి సర్కారు హయాంలో ఈ మున్సిపాలిటీలో అన్ని స్థానాలను ఆ పార్టీ గెలుచుకుంది. అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. దీంతో మున్సిపాలిటీపై పట్టుకోసం అక్కడి టిడిపి నాయకులు నానా రచ్చచేశారు. పలుమార్లు వైస్ చైర్మన్ ఎన్నికను అడ్డుకున్నారు. ఒక్క కౌన్సిలర్ కూడా లేనప్పటికీ నాయకులే సమావేశాన్ని అడ్డుకోవడం గమనార్హం. చివరికి చైర్‌పర్సన్ సైతం రాజీనామా చేసేలా చేయడంలో సఫలీకృతులయ్యారు. ఎట్టకేలకు కొంత మంది కౌన్సిలర్లను చేజిక్కించుకున్న కూటమి నాయకులు తాజాగా అక్కడ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా తమ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా పావులు కదిపారు. ప్రస్తుతం ఇక్కడ చైర్మన్‌గా నార్ల భువనేశ్వరిసుందరి, వైస్ చైర్మన్‌గా ఆచంట సురేష్ ఎన్నికయ్యారు.

డిసిసిబి పీఠంపై తొలగని ఉత్కంఠ

ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డిసిసిబి) చైర్మన్ పదవిపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని డిసిసిబి చైర్మన్ల జాబితాను ప్రకటించిన విషయం విధితమే. అయితే జిల్లాతో పాటు మరో రెండు జిల్లాల చైర్మన్ల ఖరారుపై సందిగ్ధత నెలకొంది. కూటమిలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, టిడిపి ముఖ్యనేతలు పోటీపడటమే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. జనసేన పార్టీ నుంచి పిఠాపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు ఇస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేనకు, తూర్పుగోదావరి జిల్లాలో డిసిసిబి అధ్యక్ష పదవి టిడిపికి ఇచ్చేందుకు తొలుత పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. అయితే మారిన సమీకరణల నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా డిసిసిబి చైర్మన్ పదవి టిడిపిని వరించింది. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా డిసిసిబి పదవి జనసేనకు కేటాయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నేడో, రేపో దీనిపై అధికారిక ప్రకటన కూడా వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణుల్లో ఆశిస్తున్నాయి.

కోనసీమలో 'సింహాచలం' విషాదం

విశాఖ జిల్లా సింహాచలం దేవస్థానంలో గోడకూలి పలువురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో విషాదం నెలకొంది. చేతికందొచ్చిన కుమారులు దైవదర్శనానికి వెళ్లి మృతులుగా తిరిగిరావడాన్ని వారి తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. అక్కడ గోడ నిర్మించిన కాంట్రాక్టరే అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 'ప్రసాద్' పథకంలో పలు అభివృద్ధి పనులు చేజిక్కించుకున్నారు. వర్షానికి నానడం వల్లే గోడకూలిందని కమిటీ తేల్చినప్పటికీ, గోడ నాణ్యతా పనులపై చర్చ జరుగుతోంది.



నేరాలు ఘోరాలు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి బిందుమాధవ్

వీడిన హత్య కేసు మిస్టరీ - భార్యే హంతకురాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల చేబ్రోలు బైపాస్ రోడ్‌లో హత్య చేసి పడవేసిన గుర్తుతెలియని వ్యక్తి మతదేహం కేసును పోలీసులు ఛేదించారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ధర్మవరానికి చెందిన తంగెళ్ల లోవరాజును భార్య ఆమె ప్రియుడు మరో వ్యక్తితో కలిసి కత్తులతో పొడిచి హత్య చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. శనివారం జిల్లా ఎస్‌పి బిందుమాధవ్ గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు తెలిపారు. చేబ్రోలు గ్రామ శివారు బైపాస్ రోడ్‌లో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ క్యాంప్ కార్యాలయం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు మార్చి 3న పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని గుర్తుపట్టే వీల్లేకుండా శరీరంపై కత్తిపోట్ల ఆనవాళ్లు ఉండడంతో హత్యగా నిర్ధారించారు. మృతుని చేతికి ఉన్న రాగి కడియం, అల్లికతో ఉన్న తాడు తప్ప మరే ఆధారం లేదు. డిఎస్‌పి దేవరాజ్ మనీష్ పాటిల్, సిఐ జి.శ్రీనివాస్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు విచారణ చేపట్టాయి. యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదుపై గొల్లప్రోలు పోలీసులకు సమాచారం రాగా సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ దర్యాప్తు చేపట్టారు.

యలమంచిలి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తంగెళ్ల లోవరాజుకు ఏలూరుకు చెందిన శ్యామలతో వివాహం అయ్యింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్యామలకు వరసకు బావ అయ్యే మాడెం మోహన్ కుమార్‌తో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఇది గమనించిన భర్త లోవరాజు భార్యతో పాటు మోహన్ కుమార్‌ను హెచ్చరించాడు. దీంతో భార్య శ్యామల, ప్రియుడు మోహన్ కుమార్, అతడి స్నేహితుడు బల్ల గంగాధర్ రావు కలిసి లోవరాజును హత్య చేసేందుకు పథకం రచించారు. లోవరాజు కంపెనీలో పని ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోతున్న సమయంలో మోహన్ కుమార్, గంగాధర్‌రావు ఆపరేషన్లకు ఉపయోగించే సర్జికల్ కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారులో తీసుకుని వచ్చి చేబ్రోలు బైపాస్ రోడ్డులో కాలువ ఒడ్డున పడవేశారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు శ్యామల, మోహన్ కుమార్, గంగాధర్‌రావును అరెస్టు చేశారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు గ్రామానికి చెందిన జన్నీ రాంబాబు(50) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడిన ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శనివారం కానూరు అగ్రహారంలో ఎండిన రొయ్యల చెరువులో మట్టి దున్నుతుండగా చెరువుగట్టుపై నుంచి ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడి రాంబాబు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కొవ్వూరు

స్థానిక గోష్పాద క్షేత్రంలోని లాంచీల రేవు వద్ద గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, వివరాలు తెలిసినవారు కొవ్వూరు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఆయన కోరారు.

మాజీ విఆర్‌ఒ శేషగిరిరావు మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వెలగదుర్రు గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్‌ఒ నందూరి శేషగిరిరావు(81) శనివారం మృతి చెందారు. ఈయన 1983 నుంచి 10 ఏళ్ల పాటు తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాలకు కర్ణంగా సేవలు అందించారు. అనంతరం విఆర్‌ఒగా బాధ్యతలు చేపట్టి, ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కుమారుడు నందూరి వరప్రసాద్‌ను పలువురు ప్రముఖులు, ఉద్యోగులు పరామర్శించి, శేషగిరిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



సిఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న హరిబాబు

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో ఏడు కుటుంబాలకు రూ.13 లక్షల విలువ చేసే చెక్కులను ఎఎంసి మాజీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. చాగల్లు, బ్రాహ్మణగూడెం, నేలటూరు, నందిగంపాడు గ్రామాలకు చెందిన ఏడు కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ, గారపాటి సుబ్బారావు, భగత్ మాధవ్, నందిగాం సుబ్బారావు, గారపాటి మారుతిరావు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - నల్లజర్ల

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న వయసులో బాలికలకు వివాహం చేయటం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు.కిశోర బాలికలు ఒకరిని ఒకరు పరిచయం, లక్ష్యాలు నిర్ధారించుకోవడంపై నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.వెంకటలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో జిఎంఎస్‌కెకె.సౌజన్య, పంచాయితీ కార్యదర్శి గిరిజ, ఎఎన్ఎం రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

బాధితులకు బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి - యానాం

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మంజూరైన బీమా సొమ్మును ఆర్ఎఒ మునిస్వామి బాధిత కుటుంబానికి అందజేశారు. కురసాంపేటకు చెందిన పాలెపు దుర్గాభవాని గత ఏడాది సెప్టెంబర్ 13న ఇంటివద్ద చీరకు నిప్పంటు కోవడంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. గ్రూప్ ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5 లక్షలు విలువ చేసే పత్రాలను మృతురాలి కుమార్తె గాయత్రి ప్రణీతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఎడి గొంతియ్య పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యానాం

ఆదివారం జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణకు యానాం మెట్టకూరులో జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేంద్రంగా ఎంపిక చేయడంతో నిబంధనల మేరకు చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిపాలనాధికారి మునిస్వామి పరిశీలించారు. మొత్తం 134 మంది అభ్యర్థులు ఇక్కడ పరీక్ష రాయనుండగా ఎలాంటి అవకతవకలు జరగకుండా జామర్లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శరత్ చంద్ర కీర్తి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి నాగబాబు

ఉత్సాహంగా బీచ్ కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఎన్‌టిఆర్ బీచ్‌లో రెండో రోజు 12వ అంతర్ జిల్లాల 'రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ ఛాంపియన్‌షిప్-2025' పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం ఎంఎల్‌సి నాగబాబు, ఎంఎల్‌ఎ పంతం నానాజీ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో తూర్పు గోదావరి పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, ఎంఎల్‌సి రాజశేఖరం పాల్గొన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు సాన సతీష్ బాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ సాగరతీరంలో క్రీడలు చూస్తుంటే పండగ వాతావరణం కనిపిస్తుందని చెప్పారు.

కిశోర వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-గండేపల్లి

స్థానిక మండల కార్యాలయంలో కిశోరి వికాసం వేసవి శిబిరాలపై గ్రామస్థాయిలో శనివారం సిడిపిఒ ఎం.పూర్ణిమ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పిల్లల సంరక్షణ, అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, సైబర్ నేరాలు, సెల్ వినియోగం తగ్గించి తల్లులు పిల్లలతో కొంత సమయం గడపాలని, సంప్రదాయ క్రీడలు అందించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగ పార్వతి, ఎంపిడిఒ సీనియర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒఆర్ఎస్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని కొడవలిలో గొల్లప్రోలు పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం వద్ద ఒఆర్ఎస్‌పై ఆరోగ్య పర్యవేక్షకులు అవగాహన కల్పించారు. తల్లులకు వడదెబ్బ, ఉష్ణతాపంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఒఆర్ఎస్ ప్రయోజనం, వాడే విధానం, ఇంటిలో లభించే శీతల పానీయాలపై అవగాహన కలిగించారు ఆరోగ్య పర్యవేక్షకుడు అహ్మద్ బాషా, రజిమ్ బీమ్, హెల్త్ అసిస్టెంట్ ఎ.సత్తిబాబు, పాల్గొన్నారు.

తడి పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-కరప

పంచాయతీ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామాల్లో పరిశుభ్రత పారిశుధ్యంపై అవగాహన కల్పించామని డిప్యూటీ ఎంపిడిఒ సలాది వెంకట శ్రీనివాసరావు అన్నారు. సిరిపురంలో శనివారం తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయితీ ప్రజలకు ఇచ్చిన డబ్బాలలో తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులు ఇంటికి వచ్చినప్పుడు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్.సుజాత, వీర వెంకట సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి డి.దుర్గాభవాని పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ఇంటింటి సర్వే పనులు వేగవంతం కావాలని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. మండలంలోని బడుగువానిలంక గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని గ్రామస్తులను ఆయన కోరారు. అలాగే పారిశుధ్య పనుల్లో భాగంగా సిబ్బందికి చెత్త నుండి సంపద తయారీపై ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అలాగే తడి చెత్త, పొడి చెత్త సేకరించే విధానాన్ని మండలంలో గల ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కూడా కల్పించడం జరిగిందన్నారు. అలాగే సేకరించిన చెత్త నుంచి సంపద ఏ విధంగా తయారు చేయాలనే అంశంపై ప్రత్యేక శిక్షణ మండల పరిధి అన్ని గ్రామాల పంచాయతీల సిబ్బందికి ఇచ్చామన్నారు. దీనిని వలన గ్రామంలో పరిశుభ్రతతో పాటు పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరుతుందని ఆయన వివరించారు.

అలరించిన వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పిఠాపురం, తాళ్లరేవు, పెద్దాపురం

పిఠాపురంలోని స్థానిక శ్రీసూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలోని సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా తరగతులను శనివారం రిటైర్డ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిడి వెన్నపు చక్రధరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా ప్రతి వేసవిలోనూ పేద విద్యార్థులకు వివిధ అంశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్న సహదయ మిత్రమండలి సభ్యుల సేవలను ఆయన ప్రశంసించారు. ఎంఇఒలు జి.శ్యామ్‌బాబు, కె.నారాయణ దాసు మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల్లో స్పోకెన్ ఇంగ్లీష్ , ఇంగ్లీష్ గ్రామర్, రైటింగ్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, సంగీతం తదితర అంశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులలో తమ అమూల్యమైన సమయాన్ని వథా చేసుకోకుండా ఇలాంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని అభ్యసనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి ప్రధాన కార్యదర్శి చిన్నారి సతీష్, ఉపాధ్యక్షుడు పోతుల శ్రీనివాసు, కొండేపూడి శంకరరావు, మాజీ జెడ్‌పిటిసి గుడాల రామకృష్ణ, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణ రెడ్డి, రిటైర్డ్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కెవివి.సత్యనారాయణ, భాష్యం హైస్కూల్ ప్రిన్సిపల్ పోలుపర్తి వేణు, పోలీస్ డిపార్ట్మెంట్ నుండి వై.కరుణ కుమార్, కామరాజు మాస్టారు, గండేపల్లి సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో శనివారం రెండో రోజు చిన్నారులు సందడి చేశారు. చిన్నారులు చెప్పిన నీతి కథలు ఆలోచింపచేసాయి. తెలుగు పండిట్ సంగాడి వీరబాబు తెలుగు పద్యాల ప్రాముఖ్యతపై వివరించారు. పీడీ జి.మల్లేశ్వర రావు, అత్తిలి బాబూరావు, వాసంశెట్టి నందివర్ధన, పాలిక శ్రీనివాస్, కముజు ఆనంద్, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, వెదురు పావులూరి నాని, చిట్టితల్లి పాల్గొన్నారు.

పెద్దాపురం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు జివి.వెంకట్రావు, జి.లక్ష్మీనారాయణ, పాలంకి నాగరాజు, బుల్లయ్య పాల్గొన్నారు.



పిఠాపురంలో వేసవి శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న వెన్నపు

వడదెబ్బపై ఉపాధి కూలీలకు అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట పిహెచ్‌సి ఆధ్వర్యంలో తొండవరం గ్రామం ముహూర్తాల చెరువు ఏరియాలో ఉపాధి హామీ శ్రామికులకు వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ లక్షణాలపై తీసుకోవలసిన రక్షణ చర్యలపై శనివారం హెల్త్ అసిస్టెంట్ జెవిఎస్ఆర్.ప్రసాద్ అవగాహన కల్పించారు. ఉపాధి హామీ కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

అండర్-9 జిల్లా స్థాయి చెస్ పోటీల నిర్వహణ

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి చెస్ ఎంపికలు శనివారం విక్టరీ అకాడమీలో ఉత్సాహంగా జరిగాయని జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ బాలురిలో ఇద్దరు, బాలికలలో ఇద్దరిని ఎంపిక చేసి విజయవాడలో జరుగుచున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పంపించామన్నారు. జిల్లా నలుమూలల నుండి 30మంది తొమ్మిదేళ్ల లోపు బాలబాలికలు పాల్గొన్న ఈ పోటీలలో బాలుర ప్రథమ స్థానం పడాల శ్రీయాన్ రెడ్డి, ద్వితీయ స్థానం తాడి చేతన్ హర్ష సాధించారన్నారు. బాలికలలో బొడ్డు సాన్వి ప్రథమ స్థానం, ఉచ్చుల లియాన ద్వితీయ స్థానం సాధించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పతకాలు బహూకరించారు.

బిసి కులగణన బిఎస్‌పి విజయం

ప్రజాశక్తి - అమలాపురం

కేంద్రం జనగణనతో పాటు బిసి కులగణన జరపాలని నిర్ణయించడం వెనుక బహుజన్ సమాజ్ పార్టీ 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఉంది అని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుసుమ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ కాండ్రేగుల నరసింహ, మరో జిల్లా ఇన్‌ఛార్జి కాశీ లక్ష్మీ భవాని, జిల్లా ఉపాధ్యక్షులు వాకపల్లి భీమారావు, జుత్తుగ సత్యన్నారాయణ, అమలాపురం ఇంచార్జ్ పొలమూరి మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కు టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలం సిరి పల్లి గ్రామానికి చెందిన ఐటిడిపి అధ్యక్షులు అప్పారి మహేశ్వరావు(మహేష్) తండ్రి వసంతరావు ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్తు మాజీ ఛైర్మన్, పి గన్నవరం టిడిపి కన్వీనర్ నామన రాంబాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ సందర్భంగా నామన ఫౌండేషన్ ద్వారా అయిన రూ.10 వేలు మహేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంబిసి కన్వీనర్ పెండ్రా రమేష్ విలస గ్రామ శాఖ అధ్యక్షులు అక్కిశెట్టి దుర్గారావు, సిరిపల్లి టిడిపి గ్రామ శాఖ కుంచే చంద్రకాంతుడు, మట్టపర్తి అచ్చుత్, తదితరులు పాల్గొన్నారు.

12న మహా రణభేరి కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఐ.పోలవరం

పాతఇంజరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎదుర్లంక వారధి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగే మాలల మహా రణభేరి-మే 12న ఛలో కాకినాడ కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు.మాల మహానాడు నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ చేస్తూ ఆర్డినెన్స్ ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు గైడ్ లెన్స్ కు వ్యతిరేకంగా చట్టబద్ధత లేని డేటాతో ఒన్‌మాన్ కమీషన్ ఇచ్చిన రిపోర్టు ఆదారంగా చేసిన ఎస్‌సి వర్గీకరణ చెల్లదన్నారు. దీనికి నిరసనగా జరిగే సభకు మాలలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

చేనేత రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నామినేటెడ్ పాలక వర్గంలో చేనేత రంగానికి సంబంధించిన డైరెక్టర్ కు అవకాశం ఇవ్వాలని అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ సలహాదారు చింతా శంకరమూర్తి కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది కి ఉపాధి కన్పిస్తోంది చేనేత పరిశ్రమ అని గుర్తు చేశారు. జిల్లా సహకార బ్యాంక్ పాలక వర్గం నామినేటెడ్ కు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో చేనేత సొసైటి నుంచి ఒక డైరెక్టర్ ను నామినేటెడ్ చేయాలని డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లా చేనేత పరిశ్రమకు పట్టుకొమ్మ అటువంటి చేనేత పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, చేనేత పరిశ్రమను ఆదుకొవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -పెద్దాపురం

ట్రీ కటింగ్, మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల పెద్దాపురం పట్టణ పరిధిలో ఇండస్ట్రియల్ ఏరియా ఫేజ్ -1, ఫేజ్-3, రిలయన్స్ జంక్షన్, పాంటెక్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీనిని విద్యుత్ వినియోగదారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రెవెన్యూ అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ కె.శ్రీరమణి అన్నారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, తుని, తొండంగి, కోటనందూరు మండలాల తహశీల్దార్లు, డిటిలు, మండల సర్వేయర్లు, విఆర్ఒ విలేజ్ సర్వేయర్లకు నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ అంశాలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే వేగవంతంగా సమస్యల పరిష్కారానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహశీల్దారు కాంతారావు పాల్గొన్నారు.

కృష్ణ కుటుంబానికి ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ నాయకుడు మాజేటి కష్ణ భార్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా కష్ణ కుటుంబాన్ని పెద్దాపురం ఎంఎల్‌ఎ చినరాజప్ప శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి ఎంఎల్‌ఎ తీవ్ర సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ వెంట టిడిపి పట్టణ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, భీమేశ్వరాలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), కౌన్సిలర్ బలుసు వాసు, పట్టణ యూత్ అధ్యక్షుడు వల్లూరి దొరబాబు, తాతపూడి అరుణ్ వంశీ తదితరులు ఉన్నారు.

కల్వర్టు పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మేజర్ డ్రెయిన్ కల్వర్టు పనులు వేగవంతంగా నాణ్యతగా పూర్తి చేయాలని పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదేశించారు. సామర్లకోట పట్టణంలోని మఠం సెంటర్లో నిర్మాణంలో ఉన్న మేజర్ డ్రైన్‌పై కల్వర్ట్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కల్వర్టుకు స్లాబ్ రాళ్ళు ఏర్పాటు పనులను పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని కాంట్రాక్టర్‌ను ఎంఎల్‌ఎ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీష్ మోహన్, వల్లూరి దొరబాబు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -సామర్లకోట

1970లో రైల్వే ఉద్యోగుల కుమారులుగా సామర్లకోటలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల కలయిక శనివారం సామర్లకోట శ్రీభీమేశ్వర లైన్స్ క్లబ్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. వేరు వేరు పాఠశాలలో రైల్వే ఉద్యోగులు కుమారులు సామర్లకోటలో సత్యనారాయణపురంలో నివాసం ఉండి విద్యాభ్యాసం చేసి, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గోపాలచారి, ఆకాశం రామచంద్రమూర్తి, సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. .

రాజేష్‌కు ఎన్‌టిఆర్ పురస్కారం

ప్రజాశక్తి -ఆలమూరు

ఎన్‌టిఆర్ సినీ వజ్రోత్సవాల సందర్భంగా గుమ్మిలేరుకి చెందిన రెడ్డి రాజేష్ చౌదరికి ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారం లభించింది. పాన్ ఇండియా, ఫిలంత్రోపిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటున్న వారి సేవలకు గుర్తింపుగా డాక్టర్ ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారాల ప్రదాన కార్యక్రమం శనివారం విజయవాడలో నిర్వహించారు. డాక్టర్ ఎన్‌టిఆర్ విగ్రహంతో పాటు ప్రతి ఏడాది జయంతి, వర్ధంతిలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు.

5న పాడాలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాడా కార్యాలయంలో ఈ నెల 5న సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనునట్టు పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడా కార్యాలయంలో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరు విధిగా హాజరు కావాలన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

కలెక్టర్ హామీతో ర్యాలీ వాయిదా

ప్రజాశక్తి-కాకినాడ

పెదపూడి మండలం దోమాడలో న్యాయం చేయాలని 12 రోజులుగా నిరసన దీక్షలు చేసిన వారికి న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆ నిరసనను వాయిదా వేశారు. మే 5వ తేదీ సోమవారం ఈ నిరసన కార్యక్రమానికి నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా ఉన్నత అధికారుల నుండి చలో దోమాడ నిరసన పోరాట కార్యక్రమాన్ని వాయిదా వేయాలని బాధితులకు న్యాయం చేస్తామని 3 సెంట్ల భూమి, నష్టపరిహారం అందిస్తామని ఉన్నత అధికారుల నుంచి ఫోను ద్వారా సమాచారం రావడంతో 5న జరగవలసిన నిరసనను వాయిదా వేస్తున్నట్లు నాయకులు సిద్ధాంతుల కొండబాబు, తోటి చంగల్ రావు, ఏనుగుపల్లి కృష్ణ, పెండ్యాల రాము, దారా లోవరాజు, ఉల్లం రవి, మురారి రవికుమార్, లింగం నాని బాబులు తెలిపారు.